

అభూత కల్పనతో దాడి

టీడీపీ నేతలు అభూత కల్పనతోనే దాడులకు పాల్పడ్డారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు. - 10లో



అలసత్వంపై ఆగ్రహం

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించమని విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ హెచ్చరించారు. - 10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	35	25
తిరుపతి	35	23
తిరుమల	30	19
గూడూరు	36	25
నగరి	34	23

న్యూస్‌రీల్

మంత్రి పెద్దిరెడ్డి చేతులమీదుగా నియామకపత్రం



మంత్రి పెద్దిరెడ్డి నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న నాగరాజారెడ్డి

పుంగనూరు: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా శుక్రవారం బోయకొండ గంగమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌గా నియామక పత్రాన్ని నాగరాజారెడ్డి అందుకున్నారు. మంత్రి మాట్లాడుతూ ఆలయాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.భారతి, ఏ.రాజేష్ పాల్గొన్నారు.

నూతన భవనాల పరిశీలన



భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్, తహసీల్దారు కార్యాలయ భవనాలతోపాటు, జ్యోతీరావు పూలే బాలికల గురుకుల పాఠశాల భవనాన్ని జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. కొత్త భవనాలను మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఆయన వెంట ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి ఉన్నారు.

విషజ్వరాలపై అప్రమత్తం



పరిసరాల పరిశీలనలో డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి

చిత్తూరు రూరల్ : సీజనల్‌గా వ్యాపించే విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి సూచించారు. శుక్రవారం చిత్తూరు నగరంలోని మురకంబట్టులో చేపట్టిన ఫ్రైడే..డ్రైడేను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిసరాల పరిశుభ్రతను తనఖీ చేశారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. పాత టైర్లు, ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లను ఎక్కడ పడిస్తే దోమలు వ్యాప్తి చెంది విషజ్వరాలు ప్రబలే ప్రమాదముందని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహనతో జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. జిల్లా మలేరియా నివారణ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

పుంగనూరులో టిడ్కో గృహాల తాళాలను లబ్ధిదారులకు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, కలెక్టర్ షణ్మోహన్ తదితరులు



"పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. ప్రతి కుటుంబానికీ గూడు కల్పించాలనే మహోన్నత ఆశయంతో ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగానే లక్షలాది మందికి ఇంటి స్థలాలు పంపిణీ చేశారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ గృహ నిర్మాణాలను శరవేగంగా పూర్తి చేయిస్తున్నారు. ఉత్తమ లక్ష్యంతో నిరుపేద బతుకుల్లో వెలుగులు నింపుతున్నారు. ఈ క్రమంలో అత్యాధునిక వసతులతో జగనన్న కాలనీలను తీర్చిదిద్దారు. నాణ్యమైన టిడ్కో ఇళ్లను అద్భుతంగా నిర్మించి పంపిణీ చేస్తున్నారు'' అంటూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వివరించారు. శుక్రవారం పుంగనూరులో టిడ్కో గృహాల ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

- పుంగనూరులో టిడ్కో ఇళ్ల ప్రారంభం
- సంతోషంగా సామూహిక గృహ ప్రవేశాలు
- లబ్ధిదారుల హర్షాతిరేకాలు
- నూతన వస్త్రాలు పంపిణీ చేసిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

స్వగృహ సంబరం

పుంగనూరు : పట్టణంలో నూతనంగా నిర్మించిన టిడ్కో ఇళ్లతోపాటు జగనన్న కాలనీల్లో శుక్రవారం సామూహిక గృహ ప్రవేశాలను పండుగ వాతావరణంలో చేయించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎంపీ రెడ్డెప్ప, కలెక్టర్ షణ్మోహన్‌తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. పుంగనూరులోని గూడూరుపల్లె వద్ద నిర్మించిన 1,536 టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీలోని 732 గృహాలను ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ క్రమంలో ముందుగా దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డెప్ప, జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా, కౌన్సిలర్ కాంతమ్మ పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని 1,221 మహిళా సంఘాలకు సున్నావడ్డీ పథకం కింద రూ.25 కోట్ల చెక్కులు పంపిణీ చేశారు. ఏటిగడ్డపాళ్యం, తాటిమాకులపాళ్యం, కొత్తపేట, యూబీ కాంపౌండులో ప్రజలకు రక్షిత మంచినీటిని అందించేందుకు ఎంపీ మిథున్‌రెడ్డి రూ.10లక్షల వ్యయంతో నిర్మించిన నాలుగు ఆర్‌ఓ ప్లాంట్లను ప్రారంభించారు.

31 బ్లాకులు.. 1,536 ఇళ్లు

పుంగనూరులోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం వెనుక భాగంలో సుమారు రూ.10 కోట్లు విలువైన 5 ఎకరాల్లో 31 బ్లాకులుగా 1, 536 టిడ్కో గృహాలు నిర్మించారు. ఒక్కో ఇంటికి రూ. 6లక్షలు ఖర్చు చేసి నాణ్యతాప్రమాణాలతో సుందరంగా నిర్మించారు. 30 అడుగుల వెడల్పు గల సిమెంటు రోడ్లు, కాలువలు, ఆర్చి నిర్మించారు. రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు.అలాగే ఓవర్‌హెడ్ ట్యాంకుల ద్వారా పైపులైన్లు వేసి ఇంటింటికి కొళాయిల ద్వారా నీటి సరఫరాకు చర్యలు చేపట్టారు. ఇందు కోసం మొత్తం రూ.99.49 కోట్లు వెచ్చించారు.

ఉచితంగా పంపిణీ

గత టీడీపీ సర్కారు టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల నుంచి రూ.2.65 లక్షల చొప్పున వసూలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు జీఓ సైతం జారీ చేసింది.అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ జీఓను రద్దు చేసింది. ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేకుండా రూ.15లక్షల విలువైన ఇల్లు, స్థలాన్ని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని సంకల్పించింది. దీనిపై లబ్ధిదారుల్లో హర్షాతిరేకం వ్యక్తమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై సర్వత్రా ప్రశంసల జల్లు కురిసింది.



మహిళా సంఘాలకు మెగా చెక్కు అందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ



సభకు హాజరైన అశేష జనసందోహం

సకల వసతులతో ఆర్డీఓ కార్యాలయం



భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే ఆరణి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఆర్డీఓ కార్యాలయ భవనాన్ని సకల వసతులతో నిర్మించినట్లు డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం చిత్తూరులో నూతనంగా నిర్మించిన ఆర్డీఓ కార్యాలయ భవనాన్ని వారు ప్రారంభించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఉద్యోగులు మంచి వాతావరణంలో పనిచేసేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం కలిస్తోందన్నారు. అలాగే ఉద్యోగుల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లా డుతూ ప్రభుత్వం చేసే ప్రతి కార్యక్రమంలో ఉద్యోగుల పాత్ర కీలకమైందని చెప్పారు. భవన నిర్మాణానికి ఆర్థిక సాయం అందించిన ఐటీసీఎల్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండేలా నూతన భవనం నిర్మించినట్లు వెల్లడించారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ రూ.2.25 కోట్లతో నూతన భవనం నిర్మించడం ఆనందకంగా ఉందన్నారు. ఈ క్రమంలోనే ఏపీపీఎస్సీ గ్రూప్ 4 లో నియమితులైన 66 మంది ఉద్యోగులకు నియామకపత్రాలను మంత్రుల చేతులమీదుగా అందజేశారు. అనంతరం చిత్తూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నూతన భవన నిర్మాణానికి మంత్రులు భూమిపూజ చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నగర మేయర్ అముద, డీఆర్‌ఓ రాజ శేఖర్, విదేశీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు జ్ఞానేంద్ర రెడ్డి, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి, ఆర్డీఓ రేణుక, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, ఈడిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కేజే శాంతి, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజ్యలక్ష్మి, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఆర్డీఓ కార్యాలయం ఏవో రామాంజులునాయక్ పాల్గొన్నారు.

నేటి నుంచి దసరా సెలవులు



చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా పాఠశాలలకు శనివారం నుంచి దసరా సెలవులు ఇస్తున్నట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మిషనరీ పాఠశాలలకు మాత్రం 21 నుంచి సెలవులు ఉంటాయన్నారు. 25వ తేదీన పాఠశాలలను పునఃప్రారంభించనున్నట్లు వివరించారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా పాఠశాలల అనుమతులు సైతం రద్దు చేస్తామని స్పష్టం చేశారు.

డీఈఓ విజయేంద్రరావు

పోలీసు జాగిలాలకు అభినందన

చిత్తూరు అర్బన్ : పోలీసు జాగిలాలు ఇందు, రోసీని ఎస్పీ రిషాంత్‌రెడ్డి అభినందించారు. విజయవాడలోని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) విభాగంలో ఎనిమిది నెలల పాటు శిక్షణ పొందిన ఈ రెండు శునకాలు శుక్రవారం చిత్తూరుకు చేరుకున్నాయి. శిక్షణలో ఇందు ఆల్‌రౌండ్ ప్రతిభ చూపించి గోల్డ్‌మెడల్ సాధించింది. ఈ మేరకు హోంమంత్రి చేతులమీదుగా సంరక్షకుడు అప్సర్ బాషా బహుమతి అందుకున్నారు. అలాగే ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో రోసీ సైతం ప్రతిభ చూపించడంతో సంరక్షకుడు టి.దినేష్ అభినందనలు అందుకున్నారు. శుక్రవారం తమ వద్దకు వచ్చిన ఇందు, రోసీని ఎస్పీ రిషాంత్‌రెడ్డి, ఎస్‌ఈబీ ఏఎస్పీ శ్రీలక్ష్మి ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నారు.



శునకాలను పలకరిస్తున్న ఎస్పీ రిషాంత్‌రెడ్డి

క్రీడల్లో ట్రాన్స్‌కో ఏఈ ప్రతిభ

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో ఉద్యోగులకు నిర్వహించిన జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో చిత్తూరు డివిజన్ పెనుమూరు సెక్షన్ ఏఈ నీరజ సత్తా చాటారు. గురువారం చెన్నైలో జరిగిన క్రీడా పోటీల్లో 9 రాష్ట్రాలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు. టెన్నికాయిట్ డబుల్స్ పోటీల్లో నీరజ ప్రతిభ కనబరచి రజత పతకం సాధించారు. తమిళనాడు మంత్రుల చేతులమీదుగా ట్రోఫీ అందుకున్నారు. ఈ క్రమంలో క్రీడల్లో రాణించిన నీరజను పలువురు అభినందించారు.



ట్రోఫీతో ఏఈ నీరజ

ఆరోగ్యం.. అనన్యం

జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని అనన్య సామాన్యంగా అమలు చేస్తున్నారు. ఊరూరా హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి సేవలందిస్తున్నారు. స్పెషలిస్ట్ డాక్టర్లతో చికిత్స చేయించడమే కాకుండా ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. శస్త్రచికిత్సలు.. స్కానింగ్ అవసరమైన వారిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే వైద్యశిబిరాల వద్ద ఉదయం నుంచే రోగులు బారులు తీరుతున్నారు. ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చేపట్టిన చర్యలను ప్రశంసిస్తున్నారు.

- చిత్తూరు రూరల్

- పకడ్బందీగా 'సురక్ష' సేవలు
- ఊరూరా హెల్త్ క్యాంపులు
- కార్పొరేట్ స్థాయిలో వైద్యం
- బారులు తీరుతున్న ప్రజలు

జిల్లా సమాచారం

శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరాలు	:	25
మొత్తం ఓపీలు	:	8,125
అందులో జనరల్ ఓపీలు	:	3,370
ఓజీజీ	:	642
పీడియాట్రిక్	:	518
ఆర్థోపెడిక్	:	1,034
డెంటల్	:	121
చర్మ సంబంధితాలు	:	297
ఆప్తమాలజీ	:	1,469
ఇతర సమస్యలు	:	764
కళ్లజోళ్లు అందుకున్న వారు	:	641 మంది
సేవలందించిన పీహెచ్‌సీ వైద్యుల సంఖ్య	:	56
స్పెషలిస్ట్ డాక్టర్లు	:	54



అప్పలాయిగుంటలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం వద్ద పౌష్టికాహార స్టాల్ పరిశీలిస్తున్న మంత్రి రోజా

వైద్య సేవలు సూపర్

పుత్తూరు రూరల్: ప్రజలకు మేలు చేయాలనే నిండు మనసుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా వైద్య సేవలు అభినందనీయమని, సిబ్బంది చిత్తశుద్ధికి కృతజ్ఞతలని మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. శుక్రవారం వడమాలపేట మండలం అప్పలాయిగుంటలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆమె సందర్శించారు. మంత్రి మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వైద్య సేవలందిస్తున్నారని తెలిపారు. ఫలితంగా హెల్త్ క్యాంపులు కిటకిటలాడుతున్నాయన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్న దృఢ సంకల్పంతో వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులను తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గడచిన నాలుగేళ్లలో రూ.8,845 కోట్లతో 1.40 కోట్ల కుటుంబాలకు ఉచిత వైద్య సేవలు అందించినట్లు వివరించారు. అలాగే వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచిత కంటి చికిత్సలతో పాటు కళ్లజోళ్ల పంపిణీకి రూ.13 కోట్లు వెచ్చించినట్లు వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, 542 వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద రూ.1,004 కోట్లతో 16.19 లక్షల మందికి లబ్ధి చేకూర్చినట్లు చెప్పారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద నాలుగేళ్లలో రూ.6,687 కోట్లతో 35 లక్షల మందికి పౌష్టికాహారం అందించినట్లు వివరించారు. వైద్య ఆరోగ్య శాఖలో 50 వేల పోస్టులను భర్తీ చేసినట్లు వెల్లడించారు. అనంతరం హెల్త్ కార్డులు, కళ్లజోళ్లను పంపిణి చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శాంతకుమారి, ఎంపీడీఓ భానుమూర్తి, పార్టీ మండల కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, సర్పంచ్ శేషాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు రవి, నందయ్య, అయ్యప్పరెడ్డి పాల్గొన్నారు.


సంతోషంగా ఉంది



పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా వైద్య పరీక్షలు చేయించడం సంతోషంగా ఉంది. నేను చాలా రోజులుగా ఒళ్లు నొప్పులతో బాధపతున్నా. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తే వేలకు వేల రూపాయలు ఖర్చు పెట్టించారు. కానీ నొప్పులు తగ్గలేదు. ప్రస్తుతం మా ఊర్లోనే వైద్య శిబిరం నిర్వహించి, చికిత్స చేశారు.

– మణిలక్ష్మి, నాగంవాండ్లపల్లె, ఐరాల

కళ్ల జోడు ఇచ్చారు



మాది పేద కుటుంబం. చిన్నపాటి రోగం వచ్చినా బయట చూపించుకునే పరిస్థితి లేదు. ఇప్పుడు మా ఊరికే వచ్చి ప్రభుత్వం హెల్త్ క్యాంపులు పెట్టింది. మంచి డాక్టర్లతో వైద్యం చేయిస్తున్నారు. ఇలా కూడా చేయవచ్చు అని సీఎం వైఎస్ జగన్ చూపించాడు. కంటి పరీక్షలు చేసి ఉచితంగా కళ్లజోడు ఇచ్చారు.

– రాజమ్మ, నాగంవాండ్లపల్లె, ఐరాల



పుంగనూరు మండలం చంద్రమాకులపల్లెలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వృద్ధులు

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన అగ్నిమాపకశాఖ డైరెక్టర్


కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న మురళీమోహన్

చిత్తూరు కలెక్టరేట్ : కలెక్టర్ షణ్మోహన్‌ను శుక్రవారం రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ మురళీ మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఓ మొక్కను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి పెద్దిరెడ్డి, ఏడీఎఫ్ఓ కరుణాకర్ పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈగా విజయ్‌కుమార్

చిత్తూరు కార్పొరేషన్: ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈగా తిరుపతి జిల్లా ఎస్‌ఈ విజయ్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జిగా పనిచేస్తున్న డీఈ శంకర్‌బాబు పల్నాడు జిల్లా వినుకొండ డివిజన్‌కు బదిలీ అయ్యారు. క్వాలిటీ కంట్రోల్ డీఈ నరేంద్రకుమార్‌కు డీఈగా అదనపు బాధ్యతలు ఇచ్చారు.

కర్ణాటక మద్యం విక్రేతపై కేసు

చిత్తూరు అర్బన్: బంగారుపాళ్యం మండలం టేకుమందలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న కిరణ్‌కుమార్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఈబీ ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు. శుక్రవారం నిర్వహించిన దాడుల్లో నిందితుడి వద్ద 46 బాటిళ్ల కర్ణాటక మద్యం పట్టుబడిందన్నారు. నిందితుడు పారిపోయినట్లు వెల్లడించారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

అభూత కల్పనతో పచ్చమూకల దాడి


సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేతలు


వైఎస్సార్‌సీపీ నాయకుడి దుకాణంపై రాళ్లతో దాడిచేస్తున్న టీడీపీ శ్రేణులు

- సురక్ష శిబిరం కోసమే ఆస్పత్రి వద్ద ఉన్నాం
- భానుప్రకాష్ డ్రైవర్ తప్పిదంతోనే ప్రమాదం
- రాజకీయ లబ్ధి కోసమే అసత్య ప్రచారం
- ఉద్దేశపూర్వకంగానే షాపుల ధ్వంసం
- ఆధారాలున్నాయంటున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నగరి : వైఎస్సార్‌సీపీ శ్రేణులు తన కారుపై దాడిచేశారంటూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భానుప్రకాష్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. శుక్రవారం వారు మీడియాతో మాట్లాడారు. తాము జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కోసం ఆస్పత్రివద్ద ఉన్నామే గానీ గొడవలు చేయాలన్న ఆలోచన లేదన్నారు. భానుప్రకాష్‌పై దాడి చేయదలచుకుంటే మంత్రి రోజాను దూషించిన రోజునే దాడి చేసేవాళ్లమని తెలిపారు. భానుప్రకాష్ వస్తున్న కారును డ్రైవర్ వేగంగా నడుపుతూ యూటర్న్ తీసుకోవడంతో లారీకి గుద్దుకుందని వివరించారు. ఇందులో వైఎస్సార్‌సీపీ నేతల పాత్రలేదన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే భానుప్రకాష్ అసత్య ఆరోపణలు గుప్పిస్తున్నారని మండిపడ్డారు. గత నాలుగేళ్లలో తాము ఎక్కడా దాడులకు పాల్పడలేదని, ఎవరిపైనా కేసులు పెట్టలేదని వెల్లడించారు. రికార్డులను పరిశీలిస్తే వాస్తవాలు అర్థమవుతాయన్నారు. ప్రస్తుతం కుల, మతాలకే కాదు రాజకీయాలకు అతీతంగా పాలన సాగుతోందని తెలిపారు. భానుప్రకాష్ మాటలు నమ్మి టీడీపీ నేతలు ర్యాలీగా వెళ్లి వైఎస్సార్‌సీపీ నేతలకు చెందిన దుకాణాలపై రాళ్లు రువ్వి ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెచ్చిపోయిన పచ్చమూకల దాడిపై తమ వద్ద ఆధారాలున్నాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నేతలను ఊరకుక్కలు అంటూ భానుప్రకాష్ దూషించడంపై మండిపడ్డారు. అనవసరంగా రెచ్చగొడితే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అభూత కల్పనను నమ్మి ప్రజా జీవనానికి ఆటంకం కలిగించడమే కాకుండా, తమ పార్టీ నేతల షాపులను ధ్వంసం చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

తల్లిదండ్రుల చెంతకు బాలుడు


బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించిన కానిస్టేబుల్ అన్బళగన్

రామకుప్పం : మండలంలోని బందార్లపల్లె పంచాయతీ సగినేకుప్పం వద్ద మామిడి తోటలో దివ్యాంగ బాలుడి(6)ని వదిలివెళ్లారంటూ శుక్రవారం ఉదయం సోషల్ మీడియాలో ఫొటోలు హల్‌చల్ చేశాయి. స్పందించిన పోలీసులు మామిడి తోటలోని బాలుడిని తమ సంరక్షణలోకి తీసుకున్నారు. తల్లిదండ్రుల కోసం వాకబు చేసి యానాది కాలనీకి చెందిన దంపతుల బిడ్డగా గుర్తించారు. వెంటనే వారిని పిలిపించి బిడ్డను అప్పగించారు. తామే బిడ్డను మామిడితోటలో వదిలిపెట్టి వేర్ల సేకరణకు వెళ్లినట్లు తెలిపారు. రోజూ ఇదే విధంగా వదిలి వెళతామని, పని ముగించుకుని వచ్చేప్పుడు తిరిగి తీసుకెళతామని వివరించారు. దివ్యాంగ బాలుడిని అలా వదిలి వెళ్లకూడదని పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి బిడ్డను అప్పగించారు.

రేపటి నుంచి కాణిపాకంలో నవరాత్రి ఉత్సవాలు


మరగదాంబికా సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయం

కాణిపాకం (యాదమరి): కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అనుబంధమైన మరగదాంబికా సమేత మణికంఠేశ్వర స్వామి గుడిలో నవరాత్రి ఉత్సవాలను ఆదివారం ప్రారంభించనున్నట్లు ఈఓ వెంకటేశు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారు రోజు ఓ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు వెల్లడించారు.

- 15వ తేదీ సరస్వతీ దేవి అలంకారం
- 16న లక్ష్మీదేవి అలంకారం
- 17న రాజరాజేశ్వరి అలంకారం
- 18న కుంభాదేవి అలంకారం
- 19న గాయత్రీదేవి అలంకారం
- 20న అన్నపూర్ణదేవి అలంకారం
- 21న కాత్యాయనీదేవి అలంకారం
- 22న బాలత్రిపుర సుందరీదేవి అలంకారం
- 23న దుర్గాదేవి అలంకారం
- 24న మహిసాసుర మర్ధని అలంకారం

అలసత్వంపై ఆగ్రహం

- పాఠశాలలు, కళాశాలలను తనిఖీ చేసిన విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్
- విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన
- ఉపాధ్యాయుల పనితీరుపై మండిపాటు


చిత్తూరులోలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

చిత్తూరు కలెక్టరేట్ : విధి నిర్వహణలో అలసత్వం వహించిన ఉపాధ్యాయులపై రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా చిత్తూరులోని వరదప్పనాయుడు మున్సిపల్ హైస్కూల్, సంతపేటలోని నేషనల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, వార్డు సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం చిత్తూరు రూరల్, గుడిపాల మండలాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వరదప్పనాయుడు పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థుల నోట్‌బుక్‌లను పరిశీలించారు. మొత్తం 37 మంది విద్యార్థులకు గాను 30 మంది సిలబస్ అయిన సోషల్ సబ్జెక్ట్ పాఠ్యాంశాలకు నోట్సు రాయకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నోట్సు తనిఖీ చేయని సంబంధిత సబ్జెక్ట్ టీచర్, హెచ్‌ఎంతోపాటు డీవైఈఓపై మండిపడ్డారు. హెచ్‌ఎం లక్ష్మీ పై శాఖాపరమైన చర్యలకు నివేదికలు పంపాలని డీఈఓ విజయేంద్రరావును ఆదేశించారు.

నేషనల్ పాఠశాలలో టీచర్లకు ప్రశంసలు

సంతపేట లోని నేషనల్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఇంగ్లిష్, గణితం, ఈవీఎస్ సబ్జెక్టుల్లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అక్కడి సబ్జెక్ట్ టీచర్లు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. మధ్యాహ్నభోజనం రుచి చూశారు. నాడు నేడు పనులను పరిశీలించారు. సంతపేట 44 వ వార్డు సచివాలయానికి వెళ్లి జీఈఆర్ అమలుపై ఆరా తీశారు. చిత్తూరు రూరల్ మండలం మాపాక్షి హైస్కూల్ లో ఆరో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సైన్స్ సబ్జెక్టును పిల్లలు తెలుగులో రాస్తుండడంపై టీచర్, హెచ్‌ఎంను మందలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీని కలెక్టర్ షణ్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ని పరిశీలించారు. ఆ పాఠశాల పరిశీలన కలెక్టర్ షణ్మోహన్ ప్రిన్సిపల్ సెక్రటరీని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గాజులపల్లె ప్రాథమిక పాఠశాలతోపా, గుడిపాల మండలంలోని జెడ్పీహైస్కూల్, జూనియర్ కళాశాలను ఆయన తనిఖీ చేశారు.

ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వం చెల్లిస్తున్న వేతనానికి తగ్గట్టు పని చేయాలని స్పష్టం చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమాల్లో డీఈఓ విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, చిత్తూరు నగరపాలక కమిషనర్ అరుణ, డీవైఈఓ చంద్రశేఖర్, ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్, ఇంటర్మీడియట్ డీవీఈఓ దయానందరాజు పాల్గొన్నారు.

'ట్యాబ్' పాఠాలు తప్పనిసరి

గుడిపాల : ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లతో 8వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించాలని పాఠశాల విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని శ్రీరంగంపల్లె, బొమ్మసముద్రం హైస్కూళ్లు, కాలేజీని తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలు ట్యాబ్‌లు వాడకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యాకానుకగా అందించిన బ్యాగులను కాకుండా వేరే బ్యాగులను తీసుకురావడంపై మండిపడ్డారు. కొందరు షూ వేసుకురాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుంటే ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని స్పష్టం చేశారు. తీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం బొమ్మసముద్రంలోని కాలేజీకి వెళ్లి బోధన విధానానంతోపాటు మౌలిక వసతులు, విద్యార్థుల హాజరును తనఖీ చేశారు. అలాగే పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి విద్యాకానుక సామగ్రిని పరిశీలించారు. పాఠశాలకు తప్పనిసరిగా విద్యాకానుక బ్యాగ్‌లోనే పుస్తకాలు తీసుకురావాలని సూచించారు. అనంతరం గుడిపాలలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను సందర్శించారు. నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారా అని విద్యార్థినులను ఆరా తీశారు.

గైడ్ ఎందుకు..?

యాదమరి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఎందుకు గైడ్‌లు కొనమన్నారని ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ప్రశ్నించారు. శుక్రవారం రాత్రి యాదమరిలో పలువురు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి నోట్ పుస్తకాలను పరిశీలించారు. ఓ విద్యార్థి వద్ద తెలుగు గైడ్ ఉండడంతో ఇది ఎందుకు అని అడిగారు. తెలుగు టీచర్ కొనమన్నారు అని చెప్పగానే పాఠశాల హెచ్‌ఎంపై మండిపడ్డారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్

చిత్తూరు కలెక్టరేట్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పోటుగూరి భాస్కర్‌ను నియమితులయ్యారు. శుక్రవారం ఈ మేరకు పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ప్రకటన విడుదల చేశారు. అలాగే చిత్తూరు నగర కమిటీ అధ్యక్షుడిగా టిక్కీ రాయల్‌ను నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలుడి అప్పగింత


బాలుడిని అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి

చిత్తూరు రూరల్: తప్పిపోయిన బాలుడిని చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం రాత్రి తండ్రికి అప్పగించారు. సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు..తమిళనాడులో సిప్‌కాట్‌కు చెందిన కామాక్షి సుందరం అనే బాలుడు గురువారం చిత్తూరులో తిరుగుతుండా కొందరు వ్యక్తులు వన్‌టౌన్‌పోలీస్ స్టేషన్‌కు చేర్చారు. కాగా బాలుడు అదృశ్యంపై సిప్‌కాట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వారి సమక్షంలో ఆ బాలుడిని తండ్రికి అప్పగించారు.

ప్యాసింజర్ రైళ్లు రద్దు

చిత్తూరు కార్పొరేషన్: రైల్వే ట్రాక్ మరమ్మతుల కారణంగా ఈనెల 16 నుంచి 22 వరకు ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. తిరుపతి–కాట్పాడి మార్గంలో తాత్కాలికంగా రాకపోకలు ఉండవని వెల్లడించారు

బాలిక ఆత్మహత్య

పెనుమూరు(కార్వేటినగరం) : స్థానిక అంబేడ్కర్ కాలనీలో ఓ బాలిక (16) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడింది. ఇంట్లో పెళ్లి సంబంధాలు చూస్తున్నారని మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరేసుకుంది. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

హోటళ్ల రివ్యూల ఆశ చూపి సైబర్ నేరాలు

చిత్తూరు అర్బన్: ప్రముఖ హోటళ్ల గురించి మంచి రివ్యూలు రాస్తే ఖాతాలో నగదు జమ చేస్తామని కొందరు సైబర్ నేరగాళ్లు పంపే మెసేజ్‌లపై జాగ్రత్త వహించాలని చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో హెచ్చరించారు. పాజిటివ్ రివ్యూలు రాయమంటూ కాల్‌సెంటర్ల నుంచి కొందరు ఫోన్లు చేసి, వాట్సాప్‌నకు లింకులు పంపుతున్నారని తెలిపారు. ఒక్కో రివ్యూకు రూ.150 ఇస్తామని ఆశ చూపి, ఖాతాలో ఉన్న డబ్బులన్నీ కాజేస్తారని, ఇలాంటివాటిని నమ్మొద్దని ఎస్పీ పేర్కొన్నారు. ఇలాంటి లింకులు వచ్చినా, ఎవరైనా ఫోన్ చేసి మోసాలకు పాల్పడినా www.cybercrime.gov.in అనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదులు నమోదు చేయాలని ఎస్పీ కోరారు.